క్లుప్తంగా

మాజీ గన్‌మన్‌కు నివాళి

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి పూర్వపు గన్‌మన్ ఎరకులరెడ్డి సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి వెంటనే వారి నివాసానికి వెళ్లి ఎరుకులరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో దాతలు

చంద్రగిరి : మండలంలోని కొటాల మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు దాతలు సోమవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఏకం యూఎస్ఏ(సిర్స్) ఆర్థిక సహకారంతో సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 80 మంది పిల్లలకి నోట్ బుక్స్ పంపిణీ చేసినట్లు సభ్యులు తెలిపారు. సంస్థ ప్రధాన కార్యదర్శి హేమశేఖర్ మాట్లాడుతూ ఏటా వెయ్యి మందికి పైగా విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్నామని వెల్లడించారు. హెచ్‌ఎం కోదండపాణి, ఉపాధ్యాయులు రాజేంద్ర, వెంకట్ నాగులు, లక్ష్మీనారాయణ, సరస్వతమ్మ పాల్గొన్నారు.

ఫీ'జులుం' ఆపాలని డిమాండ్

తిరుపతి సిటీ : ఎస్వీయూలో విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేయడం వెంటనే ఆపాలని పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి ఆర్. ఆషా డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు వీసీ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కట్టే ఫీజులతోనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామంటూ వేధించడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వం సైతం ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. మెస్ బిల్లు, పరీక్ష ఫీజులు చెల్లించలేని పేద విద్యార్థులపై అధికారులు జులుం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. నేతలు స్రవంతి, బాలాజీ, గాడి లింగం, శంకర్, ప్రసాద్, శ్రావణి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్


యూనిఫామ్ పంపిణీ చేస్తున్న నేతలు

తిరుపతి రూరల్ : మండలంలోని తుమ్మలగుంట పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్ ఇతర సామగ్రి పంపిణీ చేశారు. సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ సుబ్బరామిరెడ్డి, ఉప సర్పంచ్ గోపాల్‌రెడ్డి, కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, టీడీపీ నేత బిరుదాల భాస్కర్‌రెడ్డి అందజేశారు.

స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్


పింక్ బస్సు వద్ద వైద్య సిబ్బంది

చంద్రగిరి : మండలంలోని కొటాల పీహెచ్‌సీలో సోమవారం తిరుపతి స్విమ్స్ వైద్యులు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ చేపట్టినట్లు వైద్యాధికారులు తెలిపారు. మంగళవారం ఎర్రావారిపాళెం, భాకరాపేట, గురువారం యలమంద, నెరబైలులో స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.


విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



తిరుపతి కల్చరల్ : ఇస్కాన్ మందిరంలో సోమవారం నిర్వహించిన చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన లభించింది. రామాయణం, మహాభారతం, కృష్ణలీలలు వంటి అంశాలపై పోటీలు నిర్వహించారు. ఇస్కాన్ కార్యదర్శి లీలాపారాయణదాసు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణపై.. : ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఎస్వీ జులాజికల్ పార్క్‌లో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సోక్రటీస్ పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందుకున్నారు.

చంద్రగిరికి ట్రైనీ ఎస్‌ఐలు


ఫిర్యాదీలతో మాట్లాడుతున్న ఎస్‌ఐలు

చంద్రగిరి : స్థానిక పోలీసు స్టేషన్‌కు ఇద్దరు ట్రైనీ ఎస్‌ఐలను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నియమించారు. సోమవారం ఈ మేరకు శ్రీకాకుళానికి చెందిన తరుణ్, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన మంజుల బాధ్యతలు స్వీకరించారు.

విలీన ప్రక్రియ సరికాదు

పాకాల : ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల విలీన ప్రక్రియ సరికాదని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విలీన ప్రక్రియను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.


సింగాలగుంటలో చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను ప్రజలకు వివరిస్తున్న అభినయ్‌రెడ్డి, ఇమామ్


తాగునీటి సమస్యపై అభినయ్‌కి ఫిర్యాదు చేస్తున్న మహిళలు

నయవంచనే బాబు నైజం

"ఎన్నికలు వస్తే ఓట్ల కోసం నోటికొచ్చిన అబద్ధాలు చెబుతారు. అరచేతిలో స్వర్గం చూపించి ప్రజలను నమ్మిస్తారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలో తొక్కుతారు. నిరుపేదలనే కనికరం కూడా లేకుండా మోసం చేస్తారు. నయవంచే చంద్రబాబు నైజం.. పథకాల పేరుతో ఆయన చేసిందంతా మోసం.. జగనన్న కంటే అధికంగా సంక్షేమ ఫలాలు అందిస్తామంటూ జనాలకు చేసింది ద్రోహం" అని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు. బాబు మేనిఫెస్టో మోసాలను క్షేత్ర స్థాయిలో నగరవాసులకు వివరించారు.

- సూపర్ సిక్స్ పేరుతో మోసం
- రెండింతల సంక్షేమం అంటూ ద్రోహం
- ప్రజలకు ఒక్క పథకం కూడా అందించని చంద్రబాబు
- క్షేత్రస్థాయిలో వివరించిన భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : ఎన్నికల్లో మొసలికన్నీరు కారుస్తూ ఇదివరకు చంద్రబాబును కాదు..నేను మారాను. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంటే రెండింతలు సంక్షేమ పథకాలు అందిస్తా.. సంక్షేమ పథకాలు పొందేందుకు ఆంక్షలు కూడా ఏమీ ఉండవు..మీకు మేము ఇచ్చే బాండ్లే ఇందుకు సాక్ష్యం.. ఇవి మీ దగ్గర ఉంటే మీకు అన్ని పథకాలు వచ్చేసినట్లే అంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు చిలకపలుకులు వల్లించి, ఇప్పుడు ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నమ్మిన వాళ్లను నట్టేట ముంచారని ఆరోపించారు. చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను సోమవారం నగరంలోని 38వ డివిజన్ సింగాలగుంటలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అమలు అవుతున్నాయా..? చంద్రబాబు చెప్పిన సూపర్‌సిక్స్‌లో తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, యాభై ఏళ్లు నిండిన మహిళలకు పెన్షన్, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు వంటి సంక్షేమ పథకాలు వస్తున్నాయా? అని ఆరా తీశారు. స్థానికులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో చంద్రబాబు మాటలను నమ్మి మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

తాగునీటికి అవస్థలు

సింగాలగుంటలో నెలల తరబడి తాగునీటి కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏ సమస్య వచ్చినా మీరున్నారన్న ధైర్యంతో ఉండేవాళ్లమని, ఇప్పుడు ఎమ్మెల్యే ఎవరో కూడా తెలియడం లేదని అభినయ్‌కు ఫిర్యాదు చేశారు. తాగునీటి సమస్యపై ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నామని వాపోయారు. అభినయ్ స్పందిస్తూ ప్రజలకు అండగా ఉంటామని, వారి సమస్యలపై పోరాటం సాగిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె ఇమామ్ సాహెబ్, గంగామోహన్, మస్తాన్, సుబ్రమణ్యం, భానుప్రకాష్, ఉమా, బాలకృష్ణ, శ్రీనివాసులు, హేమంత్, సుధా, అమ్ములు, మాధవి, చందు, ఖదీర్, తులసి, లత, సునీల్, నాగేంద్ర, కుమార్, అఖిల్, సాయి పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ఫీజులు దారుణం


వీసీకి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో పీహెచ్‌డీ సబ్మిషన్ ఫీజును రూ.9,339 నుంచి రూ.15వేలకు పెంచడం దారుణమని, పెంచిన రుసుమును తక్షణం తగ్గించాలని పరిశోధక విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు వీసీ అప్పారావును కలసి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీల కో-కన్వీనర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ మూడు నెలల ముందు పీహెచ్‌డీ సబ్మిషన్ ఫీజుని 66 శాతం పెంచారని, ఆ విషయం పరిశోధక విద్యార్థులకు తెలియకుండా గోప్యంగా ఉంచడంలో అంతర్యమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూసా ద్వారా ప్రతినెలా రూ. 5వేల ఫెల్లోషిప్ అందిస్తామన్న ప్రతిపాదన అమలు చేయలేదని మండిపడ్డారు. కాలేజీ, సబ్మిషన్ ఫీజులను పెంచేస్తే పీహెచ్‌డీ పూర్తిచేయలేని దుస్థితి దాపురిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీసీ స్పందిస్తూ యూనివర్సిటీ రీసెర్చ్ కమిటీ సమావేశంలో పీహెచ్‌డీ సబ్మిషన్ ఫీజు తగ్గించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పరిశోధక విద్యార్థులు శ్రీనివాస్, సాయి, శ్రీకాంత్, మనోజ్, శివ, కృష్ణ, సత్య నారాయణ, దుర్గారావు, బాలయోగి, సతీష్, ప్రవీణ్, స్వాతి, కొమరేషన్, సంతోష్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పీ-4 సర్వే


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్యఆదేశించారు.సోమవారం కచ్చపి ఆడిటోరియంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శుల ఎంపికపై అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రక్రియలో అవకతవకలకు పాల్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.అలాగే నగరంలో పారిశుద్ధ్యం మరింత మెరుగ్గా చేపట్టాలని సూచించారు. పకడ్బందీగా పన్ను వసూలు పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీసీపీ ఖాన్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం : పీ-4 సర్వేపై తహసీల్దార్ మధుసుదన్ రావు సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు లబ్ధి చేకూరేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ప్లాస్టిక్ రహిత పంచాయతీలే లక్ష్యం

తిరుపతి రూరల్ : తిరుపతి సమీపంలోని పంచాయతీలను ప్లాస్టిక్ రహితంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ దయాసాగర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అందులో భాగంగానే ఇంటింటి చెత్త సేకరణను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇదివరకు రేషన్ పంపిణీకి ఉపయోగించిన ఎండీయూ వాహనాలను రీసైక్లింగ్‌కు ఉపయోగపడే ప్లాస్టిక్ వస్తువులను ఇంటింటిక వెళ్లి సేకరించేందుకు స్వచ్ఛరథాలుగా వాడనున్నట్లు చెప్పారు. ఆ ప్లాస్టిక్‌కు విలువ కట్టి అందుకు తగినట్టుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈ క్రమంలో ప్రజలు తమ ఇంట్లోని ప్లాస్టిక్ బాటిళ్లు, డబ్బాలు, ఇతరత్రా ఎలక్ట్రానిక్ వస్తువులను పడేయకుండా భద్రత పరచి స్వచ్ఛరథాలు వచ్చినపుడు అప్పగించాలని కోరారు.

'సద్గమయ'కు శ్రీకారం


శిక్షణ ప్రారంభిస్తున్న టీటీడీ అధికారులు

తిరుపతి సిటీ : నగరంలోని టీటీడీ పాఠశాలల్లో ఈనెల 31వ తేదీ వరకు నిర్వహించనున్న సద్గమయ శిక్షణ తరగతులను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా ఎస్‌జీఎస్ హైస్కూల్‌లో ప్రారంభించిన ఈ కార్యక్రమానికి హెచ్‌డీపీపీ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్, డీఈఓ వెంకట సునీల్, టీటీడీ అధికారులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు భక్తి భావం, భగవద్గీత పరిచయం, మానవీయ కోణం, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, క్విజ్, సింహావలోకనం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, వాస్తవ ప్రపంచ అధ్యయనం, వ్యక్తిగత పురోగతి, సమాజంలో భాగస్వామ్యం, నైపుణ్యాలు, సంస్కృతి, సాంప్రదాయాలపై విశ్లేషనాత్మకంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు సంబంధిత అంశాలపై పుస్తక ప్రసాదం అందించనున్నట్లు వెల్లడించారు. సద్గమయ శిక్షణ ఎస్‌జీఎస్ హైస్కూల్‌తోపాటు ఎస్వీ ఓరియంటల్ హైస్కూల్, ఎస్వీ హైస్కూల్, ఎస్‌కేఆర్ఎస్ ఇంగ్లిషు మీడియం స్కూల్, ఎస్వీ బాలికల పాఠశాల, తాటితోపులోని ఎస్‌కేఎస్ హైస్కూల్, తిరుమలలోని ఎస్వీ హైస్కూల్‌లో ప్రారంభమైంది

వేడుకగా శాత్తుమొర


శాత్తుమొర నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం ముగింపు సందర్భంగా సోమవారం వేడుకగా శాత్తుమొర నిర్వహించారు. తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి పాల్గొన్నారు.

పోషకాహారంతోనే పిల్లల ఎదుగుదల

తిరుపతి కల్చరల్ : పిల్లలకు పోషకాహారం అందిస్తే వారి ఎదుగుదలకు దోహదపడుతుందని డాక్టర్ శశి కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం అంబేడ్కర్ కాలనీలోని నవభారత్ సేవా సమాజ్ సంస్థ శిక్షణ కేంద్రంలో మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం శశికుమార్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు.


శశికుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి

తిరుపతి రూరల్ : మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉపాధి నిధులను సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అత్యవసర పనులకు మండల పరిషత్ నిధులను కేటాయించాలని స్పష్టం చేశారు. ప్రధానంగా తాగునీరు, డ్రైనేజీల నిర్వహణ, దోమల నివారణ, వీధి దీపాలకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. మఠం భూముల్లో ఇళ్లు నిర్మించుకుని పన్నులు కడుతున్న వారికి సౌకర్యాలు కల్పించాలన్నారు. పాడి చెరువు, అవిలాల చెరువు, పేరూరు చెరువు, పద్మావతీ పురం వద్ద పెద్ద చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. దీనిపై ఎంపీడీఓ రామచంద్ర సానుకూలంగా స్పందించారు. గ్రామాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

రికవరీకి రంగం సిద్ధం!

- అవినీతి ఆర్‌పీపై చర్యలకు సన్నాహాలు
- కాజేసిన సొమ్ముపై క్షేత్రస్థాయిలో విచారణ
- చట్టపరంగా అడుగులు వేస్తున్న మెప్మా అధికారులు

తిరుపతి తుడా : డ్వాక్రా సంఘాల సొమ్మును కాజేసిన అవినీతి అనకొండ రిసోర్స్ పర్సన్ హేమలతపై అధికారులు చర్యలకు రంగం సిద్ధం చేశారు. చట్టపరంగా ముందుకెళ్లాలని, వంద శాతం సొమ్మును రికవరీ చేయాలన్న ఉద్దేశంతో అడుగులు వేస్తున్నారు. ఈ దిశగానే ఆమెతో చెక్కులు, బాండ్లను రాయిస్తున్నారు. అలాగే సంఘాల వారీగా స్వాహా చేసిన నగదు వివరాలను స్వయంగా ఆమెతోనే అంగీకార పత్రం సైతం రాయించారు. హేమలత రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్న శ్రీరూన్సీ లక్ష్మీబాయి సమైక్య సంఘాలకు సంబంధించి మొత్తం 21 గ్రూపులకు చెందిన రూ. 67,09,722 మొత్తం నొక్కేసినట్లు విచారణ కమిటీ ఇప్పటికే నిర్ధారించింది. ఈ క్రమంలోనే తన పరిధిలో లేనిషిరిడి సాయి సమైక్యకు సంబంధించిన ఏడు డ్వాక్రా సంఘాలకు సంబంధించి రూ. 15,22,952 సొమ్మును బ్యాంక్ ఖాతాలకు వెళ్లకుండా తినేసినట్లు అధికారులు గుర్తించారు. సోమవారం ఈ మేరకు వివరాలను మెప్మా అధికారులు తెలిపారు.

పాఠశాలలో పెట్టుబడి పెట్టారా...!

డ్వాక్రా సంఘాల నుంచి కాజేసిన సుమారు రూ. 90 లక్షల సొమ్మును హేమలత ఓ ప్రైవేటు పాఠశాలలో పెట్టుబడిగా పెట్టినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. అలాగే పలు ప్లాట్లను కొనుగోలు చేసినట్లు గుర్తించారు. కొట్టేసిన నగదును రికవరీ చేసేందుకు పోలీసు విచారణకు వెళ్లాలని భావిస్తున్నట్లు ఇన్‌చార్జి పీడీ వెల్లడించారు.

ఆర్‌పీ హేమలత కాజేసిన నగదు.. సంఘాల వివరాలు

సంఘం పేరు	కాజేసిన సొమ్ము (రూ.లక్షల్లో)
శ్రీవిజయలక్ష్మి	2,23,800
లోహిత	5,51,997
సాక్షి	69,300
శ్రీవైష్ణవి	6,64,898
సాయి	4,31,785
నాగమ్మ	7,05,389
శ్రీలక్ష్మి	1,75,000
సిరివెన్నెల	1,21,000
అరుణోదయ	1,58,075
బోయకొండ గంగమ్మ	7,48,050
రాజరాజేశ్వరి	3,62,290
లక్ష్మీప్రసన్న	2,51,200
శివపార్వతి	1,65,125
నందిని	1,60,175
ఓం శక్తి	1,36,500
సాయిబాబా	3,53,000
భాగ్యలక్ష్మి	6,17,425
శ్రీభవానీ దేవి	3,66,503
మహాలక్ష్మి	2,27,000
కనకదుర్గ	7,210
బిస్మిల్లా	2,14,000
హనుమాన్	2,83,000
గౌరీదేవి	4,14,504
శ్రీకామాక్షి	3,87,558
శ్రీనివాసా	19,000
సౌభాగ్యలక్ష్మి	1,29,900
శ్రీకనకదుర్గ	89,350
షిరిడీ సాయి	1,99,640
మొత్తం	రూ. 82,32,674

దాహార్తిని తీర్చాలని వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

తిరుపతి తుడా : నగరంలోని 38వ డివిజన్ సింగాలగుంటలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు హిమామ్ సాహెబ్ ఆధ్వర్యంలో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. అనంతరం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందించారు.

గ్రీవెన్స్‌కు 45 వినతులు

తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 45 వినతులు వచ్చాయని కమిషనర్ మౌర్య తెలిపారు. సమస్యలను ఆయా విభాగాల పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించినట్లు వెల్లడించారు.అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, డీసీపీ ఖాన్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైద్యుడి మృతి

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ ఎం.నరేంద్ర (55) సోమవారం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. విధినిర్వహణలో భాగంగా రౌండ్లకు వెళుతుండగా హార్ట్ స్ట్రోక్ రావడంతో కుప్పకూలిపోయారు. వెంటనే రుయా ఎమర్జెన్సీ వార్డులో ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం సిమ్స్ హాస్పిటల్‌కు తీసుకెళుతుండగా మరణించారు.

హెడ్ కానిస్టేబుల్..

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుపతి రైల్వే జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఏరుకలరెడ్డి(54) గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం వేకువజామున ప్లాట్ ఫామ్‌పై విధులు నిర్వహిస్తూ కుప్పకూలిపోయారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు..

తిరుపతి క్రైమ్: విజయపురం మండలం మిట్టకండ్రిగకు చెందిన కృష్ణయ్య(60) భవన నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యారు. రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు డేగ రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నోటీస్ బోర్డు

- ఇస్కాన్ మందిరంలో ఉదయం 10 గంటలకు రామాయణం, భారతం, శ్రీకృష్ణలీలపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు.
- శ్రీనివాస స్పోర్ట్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 గంటల నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు.
- తుమ్మల గుంట మైదానంలో ఉదయం 10 గంటలకు అండర్– 8, 20 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు.
- నారాయణపురంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు తరిమెల నాగిరెడ్డి 50వ వర్ధంతి సభ.
- శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు దేవదేవేరుల ఊరేగింపు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ


జీవమునితో మాట్లాడుతున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : రోడ్డుప్రమాదంలో గాయపడి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నేత జీవమునిని పార్టీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే ఇమామ్ సాహెబ్, గంగామోహన్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పెర్సీసుసన్‌కు డాక్టరేట్



తిరుపతి రూరల్ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థిని కె. పెర్సీసుసన్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఎం. శివ పర్వతి ఆధ్వర్యంలో 'ఏ స్టడీ ఆన్ సమ్ డోమినేషన్ పెరామీటర్స్ ఆఫ్ జీఎస్ గ్రాఫ్' అనే అంశంపై ఆమె పరిశోధన పత్రాలు సమర్పించారు.

అంగన్‌వాడీ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి తుడా : నగరంలోని అంగన్ వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాస్ జనరల్ సెక్రటరీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన 21 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు మహిళలు దరఖాస్తుకు అర్హులని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులు మంగళం, వినాయకనగర్, ప్రగతినగర్, కొర్లగుంట అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేయవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఆగస్టు 4వ తేదీలోపు ఎయిర్ బైపాస్ రోడ్డులోని రాస్ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

'వసతి'లో నేతల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న నేతలు

తిరుపతి అర్బన్ : చెన్నారెడ్డి కాలనీలోని సమీకృత ఎస్సీ బాలుర హాస్టల్‌ను వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థి విభాగం ఎస్వీయూ అధ్యక్షుడు మన్నం ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ హాస్టల్‌లో సమస్యలను వెంటనే వార్డెన్‌కు తెలియజేయాలని కోరారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని, దుప్పట్లు ఇప్పించాలని, దోమలు లేకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దాలని వార్డన్ మునిశంకర్‌కు సూచించారు. నేతలు ముని, హేమంత్, మహేష్, కిషోర్, పవన్, బోస్, ప్రణదీప్ పాల్గొన్నారు.

బారులు తీరిన రోగులు


మందుల కోసం క్యూ కట్టిన రోగులు

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రి రోగులతో సోమవారం కిక్కిరిసింది. ఓపీ కోసం వందలాదిమంది తరలివచ్చారు. ఓపీ సేవల అనంతరం మందుల కోసం రోగులు బారులు తీరారు. గంటల తరబడి క్యూలో నిలబడ్డారు. సరిపడా మందులు లేకపోవడంతో అసంతృప్తిగా వెనుతిరిగారు. మందుల సరఫరా చేసే కౌంటర్ ఒకటే ఉండడంతో క్యూలో వేచి ఉండక తప్పడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. మరో కౌంటర్ పెట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వైద్య పరీక్షల కంటే మందులు తీసుకోవడమే కష్టతరంగా మారిందని వాపోయారు.